తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
ఆదివారం
30 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 321
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం




- తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాల హెచ్చరిక
- ఉత్తరాంధ్ర, రాయలసీమలో భారీ వర్షాల అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

హైదరాబాద్, ఆగస్టు 29 : బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వ్యవస్థ ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. ఈ ప్రభావం సెప్టెంబర్ 2 వరకు కొనసాగవచ్చని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో ➤ మిగతా 2వ పేజిలో..



## వేపచెట్టు వివాదం..
## ఇద్దరి దుర్మరణం

- ఎర్రగడ్డ తండాలో తీవ్ర ఉద్రిక్తత
- గొడ్డళ్లతో పరస్పర దాడులు
- ఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రి మార్గంలో మరొకరు మృతి
- ఎస్ఐపై కూడా దాడి.. తలకు గాయాలు

సూర్యాపేట, ఆగస్టు 29 : సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో శనివారం వేపచెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఇంటి పక్కన ఉన్న వేప చెట్టుకు సంబంధించిన చిన్నపాటి వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసి తీవ్ర విషాదంగా మారింది. ఇరువర్గాల వారు గొడ్డళ్లతో పరస్పరం దాడులకు దిగడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం, వేప చెట్టు యాజమాన్యం మరియు దానిని తొలగించే అంశంపై రెండు కుటుంబాల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం ఈ వివాదం మళ్లీ చెలరేగి వాగ్వాదంగా ప్రారంభమై, కొద్దిసేపటికే హింసాత్మక ఘర్షణగా మారింది. ఆగ్రహంతో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు గొడ్డళ్లతో దాడి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో ➤ మిగతా 2వ పేజిలో..



## పోలీస్ కస్టడీలో దళిత యువకుడి మృతి

- ఉత్తరప్రదేశ్‌లో ఘటన కలకలం
- పోలీస్ స్టేషన్ వద్ద కుప్పకూలిన యువకుడు
- పోలీసులపై కుటుంబ సభ్యుల ఆరోపణలు
- కార్డియోజెనిక్ షాక్‌తో మృతిచెందినట్లు పోస్టుమార్టం నివేదిక

బదాయూన్, ఆగస్టు 29 ఉత్తరప్రదేశ్‌లోని బదాయూన్ జిల్లాలో 28 ఏళ్ల దళిత యువకుడు రాజేశ్ పోలీస్ కస్టడీలో మృతిచెందిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భండారా కార్యక్రమంలో జరిగిన గొడవకు సంబంధించి పోలీసులు రాజేశ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలోనే అతడు ఒక్కసారిగా కుప్పకూలడంతో విషాదం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీడియోలో రాజేశ్ ఒక్కసారిగా నేలపై పడిపోవడం, వెంటనే ఇద్దరు పోలీసులు అతడిని లేపేందుకు, ప్రాణాలు ➤ మిగతా 2వ పేజిలో..

## చెట్టెక్కి ప్రాణాలు కాపాడుకున్నాం




- నేపాల్ వరద బాధితుల ఆవేదన
- కొండలపైకి పరుగులు.. జలప్రళయం నుంచి భారతీయుల సాహసోపేత రక్షణ
- నేపాల్‌లో జలప్రళయం,
- వరద బీభత్సం నుంచి బయటపడి.. స్వదేశానికి చేరిన భారతీయులు
- రక్షణ చర్యల్లో నేపాల్ సైన్యం, భారత రాయబార కార్యాలయం కీలక పాత్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 29 (తరంగాలు ప్రతి నిధి): నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదల నుంచి ప్రాణాలతో బయట పడి స్వదేశానికి చేరుకున్న భారతీయులు తమ భయానక అనుభవాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురవుతున్నారు. క్షణాల్లో విరుచుకుపడిన జలప్రళయం తమ జీవితాల్లో ఎన్నటికీ మరిచిపోలేని విషాదాన్ని మిగిల్చిం దని చెబుతున్నారు. బీహార్, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన కార్మికులు, యాత్రికులు, పర్యాటకులు సురక్షితంగా తిరిగి చేరుకున్నప్పటికీ, తమ కళ్ల ముందే జరిగిన విధ్వంసాన్ని తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. బీహార్ రాష్ట్రంలోని బెట్టియాకు చెందిన వలస ➤ మిగతా 2వ పేజిలో..

## వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టు "రాష్ట్ర ఆరోగ్య రంగానికి కీలకం"



- టిమ్స్, వరంగల్ హెల్త్ సిటీ పనులపై సమీక్ష
- ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులతో సమావేశం
- నిర్మాణ పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష
- పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు
- ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలని సూచన

హైదరాబాద్, ఆగస్టు 29 :వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టు రాష్ట్ర ఆరోగ్య రంగానికి కీలకమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శనివారం టిమ్స్ అల్వాల్, టిమ్స్ ➤ మిగతా 2వ పేజిలో..



## తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎంకు కీలక బాధ్యత
- రాజకీయ అనుభవానికి గుర్తింపుగా నియామకం
- రాష్ట్రపతి ఉత్తర్వులతో నియామక ప్రకటన
- పలువురు నేతల అభినందనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 29 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని తమిళనాడు గవర్నర్‌గా నియమించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదంతో ఈ నియామకానికి ➤ మిగతా 2వ పేజిలో..

## ఒక్క అర్హ ఓటు కూడా తొలగొద్దు



- అనర్హులకు చోటివ్వొద్దు
- అర్హుల ఓట్లు తొలగితే ఊరుకునేది లేదు
- ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా సాగాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియపై గడువు పెంచాలని ఈసీకి సీఎం రేవంత్

2

## వైద్య విద్యార్థిని బలవన్మరణం

- హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో విషాద ఘటన
- కర్నూలు వ్యాపారి ఏకైక కుమార్తె మృతి
- కారణాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు 29 నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ యువ వైద్య విద్యార్థిని హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలోని తన నివాస గదిలో శనివారం బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థినిని కర్నూలుకు చెందిన ప్రముఖ వ్యాపారి ➤ మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి



- కేటీఆర్ పిలుపుతో జిల్లాల్లో కార్యాచరణ ప్రారంభం
- మేడ్చల్‌లో శంబీపూర్ రాజు నేతృత్వంలో కీలక సమావేశం
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- స్థానిక సమస్యలపై పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధం

మేడ్చల్, ఆగస్టు 29 కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ➤ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక

తరంగాలు

THARANGALU DAILY NEWS

ఆదివారం, 30 ఆగస్టు , 2026




## వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టు "రాష్ట్ర ఆరోగ్య రంగానికి కీలకం"

ఎల్‌బీనగర్, వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో వైద్య మౌలిక సదుపాయాల బలోపేతానికి కీలకమైన ఈ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సమావేశంలో ఆయా ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఎదురవుతున్న సమస్యలపై అధికారులు మంత్రికి వివరాలు అందజేశారు. నిర్మాణ పనుల నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో ప్రాజెక్టులను పూర్తి చేసే అంశాలపై చర్చించారు.టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్ ఆస్పత్రుల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, సాంకేతిక సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అధునాతన వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య రంగంలో భారీ పెట్టుబడులు పెడుతోందని మంత్రి అన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల ప్రతి దశను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి టిమ్స్ ఆల్వాల్, టిమ్స్ ఎల్‌బీనగర్, వరంగల్ హెల్త్ సిటీ ప్రాజెక్టులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

## ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం బాధ్యత

### సిఎం రేవంత్‌కు నివేదిక ఇచ్చిన కమిటీ

హైదరాబాద్,ఆగస్ట్29: తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ అయింది. కమిటీ సభ్యులు కేశవరావు, కోదండరామ్, రాములునాయక్, మోతె శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేశారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం వారికి సూచించారు. ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్లు కమిటీ వెల్లడించింది.

## తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కిరణ్‌కుమార్ రెడ్డికి దేశంలోని కీలక రాష్ట్రాల్లో ఒకటైన తమిళనాడుకు గవర్నర్ బాధ్యతలు అప్పగించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివరి ముఖ్యమంత్రిగా సేవలందించారు. శాసనసభ స్పీకర్‌గా, మంత్రిగా, ఎమ్మెల్యేగా వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయనకు పరిపాలనా వ్యవహారాలపై విస్తృత అనుభవం ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ముఖ్యమంత్రిగా కీలక పరిణామాలను ఎదుర్కొన్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది.గవర్నర్‌గా రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉండగా, కేంద్రం ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, శాసనసభ, రాజ్‌భవన్ మధ్య సమన్వయం సాధించడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి నియామకాన్ని పలువురు రాజకీయ నాయకులు స్వాగతించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయనకు గవర్నర్ పదవి దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయనకు ఉన్న అనుభవం తమిళనాడు రాష్ట్రానికి ఉపయోగపడుతుందని అభినందనలు తెలియజేశారు.

చిత్తూరు జిల్లాకు చెందిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు. అనంతరం జాతీయ రాజకీయాల్లో కూడా చురుకైన పాత్ర పోషించారు. వివిధ దశల్లో ప్రజాప్రతినిధిగా, పరిపాలకుడిగా ఆయన సేవలు అందించారు. తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కిరణ్‌కుమార్ రెడ్డి త్వరలోనే రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన నియామకంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో ప్రముఖ నాయకుడు రాజ్యాంగబద్ధమైన కీలక పదవిని అధిష్ఠించనున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

## వేపచెట్టు వివాదం.. ఇద్దరి దుర్మరణం

వెంకటేశ్వర్లు యాదవ్ తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో వ్యక్తి సైదా కూడా తీవ్ర గాయాలపాలవగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఘటన సమాచారం అందుకున్న మేళ్లచెరువు పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. అయితే ఆగ్రహంతో ఉన్న ఒక వర్గం పోలీసుల చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఇరువర్గాలను చెదరగొట్టే క్రమంలో ఉద్రిక్తత మరింత పెరిగింది.

ఈ సందర్భంగా మేళ్లచెరువు ఎస్‌ఐ నవీన్‌పై కూడా దాడి జరిగినట్లు తెలిసింది. ఆగ్రహంతో ఉన్న వ్యక్తులు గొడ్డలితో దాడి చేయడంతో ఆయన తలకు గాయాలయ్యాయి. వెంటనే సహచర పోలీసులు ఆయనను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఘటన అనంతరం గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదు చేసి ఘర్షణకు దారితీసిన కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. గ్రామంలో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు అక్కడక్కడా జల్లులు పడే అవకాశముందని పేర్కొంది. గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో ఇప్పటికే చెరువులు, కుంటలు నిండిన నేపథ్యంలో తాజా వర్షాలు మరింత ప్రభావం చూపే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ రంగంపై కూడా ఈ వర్షాల ప్రభావం ఉండనుంది. ఖరీఫ్ పంటల సాగు జరుగుతున్న సమయంలో వర్షాలు ఉపయోగకరంగా మారే అవకాశమున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైతే పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షాలు, ఈదురుగాలులు, పిడుగులు సంభవించే అవకాశమున్నందున ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో సంచరించవద్దని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద ఆశ్రయం పొందకుండా ఉండాలని హెచ్చరించింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించింది. వాహనదారులు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షం పడే సమయంలో రహదారులపై జారుడు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున వేగాన్ని నియంత్రిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. వాతావరణ పరిస్థితులపై అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

## ఒక్క అర్హ ఓటు కూడా తొలగొద్దు

హైదరాబాద్, ఆగస్టు 29 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణలో 2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియలో అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదని, అలాగే అనర్హులైన ఎవరూ జాబితాలో చేరకూడదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాసిన ముఖ్యమంత్రి, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, న్యాయం, ప్రజా భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం, 2026 జూన్ 10 నాటికి రాష్ట్రంలో 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వారిలో 73.39 లక్షల మందిని గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన లేదా ఒకటికి మించి నమోదైన ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల సంఘం గణాంకాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వీరిలో 45.19 లక్షల మందిని శాశ్వతంగా నివాసం మారిన వారిగా గుర్తించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. డిజిటలైజ్ చేసిన గణన పత్రాల్లో కూడా భారీ స్థాయిలో లోపాలు ఉన్నాయని ఆయన వివరించారు.

ప్రస్తుతం అమలవుతున్న సవరణ విధానంలో కొన్ని కీలకమైన లోపాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గణన సిబ్బంది వచ్చిన సమయంలో ఇంట్లో లేని వారిని కూడా శాశ్వతంగా నివాసం మారిన వారిగా పరిగణించే పరిస్థితి ఉందని తెలిపారు. అలాగే నివాసం మారిన వారికి కొత్త ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు తగిన సహాయం అందించకుండా పాత ప్రాంతంలోని ఓటు తొలగించే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. అధికారిక నోటీసు ప్రక్రియను కూడా పూర్తిస్థాయిలో పాటించడం లేదని తెలిపారు. దీంతో అనేక మంది ఓటర్లు పోలింగ్ రోజునే తమ పేరు జాబితాలో లేదని తెలుసుకునే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్--మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన లేదా ఒకటికి మించి నమోదైన ఓటర్ల కేసులు అధికంగా ఉన్నాయని వివరించారు. ఉద్యోగాలు, వివాహాలు, తాత్కాలిక నివాస మార్పుల కారణంగా పట్టణ ప్రాంతాల్లో అనేక మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని పేర్కొన్నారు.రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను మరింత సమగ్రంగా నిర్వహించేందుకు సమయం కేటాయించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం సెప్టెంబర్ 16తో ముగియనున్న అభ్యంతరాలు, ఫిర్యాదుల గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలని కోరారు. అలాగే గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, గ్రామసభలు, వార్డు కమిటీ సమావేశాల ద్వారా ముసాయిదా జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజువారీ కూలీలు, వలస కార్మికులు, వృద్ధులు తమ పత్రాలు సమర్పించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని, కనీసం మూడు నుంచి నాలుగు వారాల సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామసభలు, సహాయ కేంద్రాల ఏర్పాటు సహా అవసరమైన పరిపాలనా సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించేందుకు సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో స్పష్టం చేశారు.

## వైద్య విద్యార్థిని బలవన్మరణం

రామ్మోహన్ రెడ్డి కుమార్తె యశ్వితగా పోలీసులు గుర్తించారు. వైద్య రంగంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్న యువతి ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులను, సహ విద్యార్థులను, వైద్య వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసుల వివరాల ప్రకారం, యశ్విత గత ఆరు నెలలుగా హైదరాబాద్‌లో ఉంటూ నీట్ పీజీ ప్రవేశ పరీక్ష కోసం ప్రత్యేక కోచింగ్ తీసుకుంటోంది. శనివారం ఆమె బస చేస్తున్న గదిలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై స్పష్టత రావాల్సి ఉందని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, కోచింగ్ సెంటర్ నిర్వాహకుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి కారణాన్ని నిర్ధారించలేమని, దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. యశ్విత కర్నూలుకు చెందిన వ్యాపారవేత్త రామ్మోహన్ రెడ్డి ఏకైక కుమార్తె కావడం ఈ విషాదాన్ని మరింత హృదయ విదారకంగా మార్చింది. ఉన్నత విద్య కోసం కృషి చేస్తున్న సమయంలో జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలిసిన వెంటనే బంధువులు, సన్నిహితులు హైదరాబాద్‌కు చేరుకుని కుటుంబాన్ని పరామర్శించారు.

పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, ఆందోళనలపై మరోసారి చర్చ మొదలైంది. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, శిక్షణ కేంద్రాలు మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు కౌన్సెలింగ్, మానసిక సహాయం అందుబాటులో ఉండాలని సూచిస్తున్నారు. యశ్విత మృతి వైద్య విద్యార్థుల వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆమె మరణానికి గల అసలు కారణాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

## చెట్టెక్కి ప్రాణాలు కాపాడుకున్నాం

కార్మికులు వరదలను "ఊహించలేని ప్రళయం"గా అభివర్ణించారు. ఒక్కసారిగా సుమారు 20 అడుగుల ఎత్తులో నీరు ఉప్పొంగి రావడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు పిల్లలను వెంటబెట్టుకుని కొండలపైకి పరుగులు తీయాల్సి వచ్చిందని తెలిపారు. తమతో కలిసి పనిచేస్తున్న ముగ్గురు సహచరులు వరదల్లో గల్లంతయ్యారని, నీరు తగ్గిన తర్వాత వెతికినా వారి జాడ దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి వరద ముప్పు ఉందన్న హెచ్చరికలతో అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాల్సి వచ్చిందని చెప్పారు.

మరో బాధితుడు ఉదయం భారీ శబ్దం విని బయటకు వచ్చేసరికి చుట్టుపక్కల ప్రాంతమంతా ధూళితో కమ్ముకుపోయిందని వివరించాడు. కొద్ది క్షణాల్లోనే వరద నీరు అన్ని వైపుల నుంచి ముంచెత్తడంతో ఎత్తైన ప్రాంతాలకు పరుగులు తీశామని చెప్పాడు. తర్వాత తిరిగి వచ్చి చూసేసరికి ఇళ్లు, వాహనాలు, మనుషులు ఏవీ కనిపించలేదని, అంతా కొట్టుకుపోయిందని వేదన వ్యక్తం చేశాడు. ఆ దృశ్యాలు ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయని తెలిపాడు. కైలాస్ మానస సరోవర్ యాత్రకు వెళ్లిన చెన్నైకి చెందిన ఓ మహిళ కూడా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. ఆమె కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, చైనా-నేపాల్ సరిహద్దు ప్రాంతంలో బస్సులో ప్రయాణిస్తుండగా వరదలు సంభవించాయి. పరిస్థితి అదుపు తప్పడంతో డ్రైవర్ బస్సును వదిలి పారిపోగా, ప్రయాణికులంతా ప్రాణాల కోసం పరుగులు తీశారు. ఆ మహిళ సమీపంలోని ఓ చెట్టు ఎక్కి మూడు నుంచి నాలుగు గంటల పాటు అక్కడే గడిపారని, అనంతరం నేపాల్ సైన్యం ఆమెను సురక్షితంగా రక్షించిందని తెలిపారు.

మహారాష్ట్రకు చెందిన పర్యాటకులు కూడా ఈ విపత్తు సమయంలో తీవ్ర ఆందోళనకు గురయ్యామని చెప్పారు. రోడ్లు కొట్టుకుపోవడం, వంతెనలు కూలిపోవడంతో ప్రయాణం పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. ప్రాణాలతో బయటపడతామో లేదోనన్న భయంతో గడిపామని, పిల్లల ధైర్యం తమకు బలాన్నిచ్చిందని పేర్కొన్నారు. పరిస్థితి తీవ్రతరం కావడంతో విమానంలో తిరిగి రావాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. రక్షణ చర్యల్లో నేపాల్ అధికారులు, సైన్యం, భారత రాయబార కార్యాలయం కీలక పాత్ర పోషించాయని బాధితులు తెలిపారు. సరైన పత్రాలు లేని పరిస్థితుల్లో కూడా నేపాల్ అధికారులు సహకరించారని, స్వదేశానికి సురక్షితంగా చేరుకునేందుకు ఏర్పాట్లు చేసిన భారత, నేపాల్ ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విపత్తు తమ జీవితాల్లో చెరగని ముద్ర వేసిందని, వరదల భయానకతను ఎప్పటికీ మరిచిపోలేమని బాధితులు పేర్కొన్నారు.

## పోలీస్ కస్టడీలో దళిత యువకుడి మృతి

కాపాడేందుకు ప్రయత్నించడం కనిపించింది. పరిస్థితి విషమించడంతో అతడిని వెంటనే సమీప ఆస్పత్రికి తరలించారు.అయితే ఆస్పత్రికి చేరుకునేలోపే రాజేశ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. యువకుడి మృతిపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని వారు డిమాండ్ చేశారు. రాజేశ్‌ను పోలీసులు కస్టడీలో కొట్టారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసుల దాడుల కారణంగానే అతడు ప్రాణాలు కోల్పోయాడని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై నిష్పక్షపాత విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.మరోవైపు పోలీసులు ఈ ఆరోపణలను ఖండించారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం రాజేశ్ కార్డియోజెనిక్ షాక్ కారణంగా మృతిచెందినట్లు వెల్లడైందని తెలిపారు. అతడి శరీరంపై ఎలాంటి బాహ్య గాయాలు లేదా దాడి ఆనవాళ్లు లేవని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై స్థానిక పరిపాలన, పోలీసు శాఖ దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. సీసీటీవీ దృశ్యాలు, వైద్య నివేదికలు, ఇతర ఆధారాలను పరిశీలించి పూర్తి వాస్తవాలను వెలికితీసే ప్రయత్నం జరుగుతోందని అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న "కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్య పాలనపై సమరభేరి" కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలో శ్రీకారం చుట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా నాయకత్వం కార్యాచరణను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద గౌడ్, మార్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ఎన్నికల హామీల అమలు పరిస్థితి, సంక్షేమ పథకాల అమలులో నెలకొన్న ఇబ్బందులపై నాయకులు విస్తృతంగా చర్చించారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ప్రభుత్వంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని సమావేశంలో తీర్మానించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నాయకులు అభిప్రాయపడ్డారు.మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, చెరువుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల రక్షణ, ట్రాఫిక్ సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకుని పోరాటం కొనసాగించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఏమి లభించింది, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారనే అంశాలను ప్రజల ముందుంచాలని సమావేశం నిర్ణయించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకత్వంలో, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల తరఫున ప్రశ్నిస్తామని జిల్లా నాయకత్వం స్పష్టం చేసింది.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
ఆదివారం, 30 ఆగస్టు , 2026


# విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం





- రూ.15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- జీవో 97 రద్దు చేయాలి..
- ఆయుష్ విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్

**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 29,తరంగాలు** :తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు,శనివారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిరసన దీక్షను నిర్వహించారు.ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రూ. 15 వేల కోట్ల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు.కనీసం విద్యాశాఖ మంత్రి కూడా లేని ఏకైక దుస్థితి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఉందంటూ ఆయన దుయ్యబట్టారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోని పక్షంలో ప్రభుత్వం తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేసే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతా యని ఆయన హెచ్చరించారు.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవైపు పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల, మరోవైపు ఆయుష్ వైద్య విద్యార్థుల పట్ల అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక వైఖరిని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రంగా ఖండించారు.కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద జీవో 97 వల్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు, ఈసెట్ రాసే విద్యార్థుల భవిష్యత్తు తీవ్ర ఆందోళనలో పడిందని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా విద్యా రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనపరుస్తోందని ధ్వజమెత్తారు.పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలో ఆయుష్ విద్యార్థులకు అత్యంత తక్కువ స్టైపెండ్ ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎండగట్టారు.

విద్యార్థుల న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచంద్రరావు ను అక్రమంగా గృహ నిర్బంధం చేయడం, నిరసనలను పోలీసు బలగాలతో అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని దుయ్యబట్టారు.ప్రభుత్వాలు మారినా విద్యార్థుల తలరాతలు మారలేదని, విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థుల కష్టాలు పట్టవా అని ప్రశ్నించారు. వెంటనే జీవో 97ను రద్దు చేయాలని, ఆయుష్ విద్యార్థుల డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో విద్యార్థి లోకంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామని గంట రవికుమార్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, బీజేపీ నాయకులు ఆడేపు రవిరాము, రాళ్లబండి మున్నా, మహంత్, బాశెట్టి సాయి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బైరి నాగరాజు, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, , రాయపురం కుమారస్వామి, పోనుగోటి వెంకట్ రావు,అంకాల జనార్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు తెకుమట్ల రేణుక, ఎస్సీ మోర్చా అధ్యక్షులు మదాసు రాజు, ఓబిసి మోర్చా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దండు కిషన్, కర్నె రవీందర్, మెంతుల యాదగిరి, మార్తా ఉషారాణి, జీలకర్ర వీరస్వామి మరియు మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు ప్రమోద్ కుమార్



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగస్టు 29,(తరంగాలు)**: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం ఎంతో గొప్పదని జనగామ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్అన్నారు.శనివారంవేల్పుగొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దైవ దర్శనం కోసం వచ్చె భక్తులకుఆర్యవైశ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడంపై నుండి విచ్చేసిన భక్తులు అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. జిల్లా అధ్యక్షులు ప్రమోద్ కుమార్ మాట్లాడుచూ ఎంతో పురాతన గల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి వివిధ ప్రాంతాలనుండి విచ్చేస్తున్న భక్తులు అన్నదాన వితరణపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. నేడు 1500 మంది భక్తులకు భోజన సౌకర్యాలను కల్పించినట్లు ఆయన తెలిపారు. తదితర ప్రాంతాలనుండి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి రావడం జరిగింది. అదేవిధంగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించేందుకు వెళ్లిన భక్తుల కోసం ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడుఅంచురి యుగంధర్ వెయ్యి మందికి అరటిపండ్లు వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గన్ను నర్సింలు, కోశాధికారి బిక్షపతి, అన్నదాన కమిటీ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి రాజన్న,కోశాధికారి శ్రవణ్ కుమార్,బోనగిరి నాగరాజు,బెలిదె హరిశంకర్ , ధంశెట్టి సోమేశ్వర్, రమేష్ కొనిశెట్టి వెంకన్న, పట్టూరి శ్రీధర్,అంచూరి శ్రీరాములు, గందెసోమన్న,అంచూరి కమల,ఇమ్మడి మాధవి,దాంశెట్టి శ్రావ్య,దొడ్డ ఉమా, తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి సేవిస్తూ ఐదుగురు వ్యక్తులు పట్టివేత

- వైద్య పరీక్షలు నిర్వహించి డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు



**ఇల్లందు ప్రతినిధి, ఆగస్టు 29,( తరంగాలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు,ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు పర్యవే క్షణలో ఇల్లందు పరిసర ప్రాంతా ల్లో గంజాయి అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారందరికీ నిబం ధనల ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల్లో గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సామా జిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.అనం తరం వారి పునరావాసం మాదకద్రవ్యాల వ్యసనం నుంచి బయటపడేందుకు డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ టి, సురేష్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాకి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.అదేవిధంగా తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయం, రవాణా లేదా సేవనానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. మాదకద్రవ్య రహిత సమాజం కోసం పోలీసు శాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో సీఐ టి.సురేష్, ఎస్ఐ ఉమ, సిహెచ్ లాల్ సింగ్, రవి కుమార్, సలీం, ఇతర సిబ్బంది ఉన్నారు.

## వైరా రోడ్డులో నూతన ఐ.కేర్ ఆప్టికల్స్ కేంద్రం ప్రారంభం

- ప్రారంభించిన డాక్టర్: తుమ్మల యుగంధర్



తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం నగరంలోని స్థానిక వైరా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఐ.కేర్ ఆప్టికల్స్ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ,ప్రజలకు నాణ్యమైన కంటి సంరక్షణ సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. నూతనంగా ప్రారంభమైన ఐ.కేర్ ఆప్టికల్స్ కేంద్రం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా, జిల్లా నాయకులు కమర్తపు మురళీ తదితరులు పాల్గొన్నారు.

## నేటి ఓరుగల్లు కాంగ్రెస్ పార్టీ దళిత చైతన్య సభ వాయిదా

- వరంగల్ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ పసునూరి భాస్కర్



వరంగల్ ప్రతినిధి ,ఆగస్టు 29 (తరంగాలు): హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో వరంగల్, జనగామ, హన్మకొండ జిల్లాల నేడు 30న నిర్వహించాల్సిన "ఓరుగల్లు కాంగ్రెస్ పార్టీ దళిత చైతన్య సభ" అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ పసునూరి భాస్కర్ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.సభ నిర్వహించే కొత్త తేదీ, వేదికను ఖరారు చేసి ప్రకటించనున్నట్లు తెలిపారు.కొత్త తేదీ, వేదిక ఖరారైన వెంటనే సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యాచరణ ప్రణాళికను వెల్లడిస్తామని పేర్కొన్నారు. సభ వాయిదా నిర్ణయానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, అన్ని మండలాల ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సహకరించాలని కోరారు.సభ వాయిదా పడినందున నేడు 30న హయగ్రీవాచారి గ్రౌండ్‌కు ఎవరూ రావద్దని పసునూరి భాస్కర్ స్పష్టం చేశారు.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 30 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

- ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిపై మంత్రుల సమీక్ష
- భూ సమస్యలు, రిజిస్ట్రేషన్లు, సర్వేలు త్వరితగతిన పరిష్కరించాలి
- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య




**యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగస్టు 29 (తరంగాలు):** భూ సమస్యలు, రిజిస్ట్రేషన్లు, సర్వేలు త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, హౌసింగ్ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు-- భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆయా శాఖల ఉన్నతాధికారులతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు.

### భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, భూముల సర్వేలు, రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ రికార్డుల సవరణ, పట్టాదారు పాస్‌బుక్‌లకు సంబంధించిన సమస్యలను మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఆలేరు నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బీర్ల అయిలయ్య కోరారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

### అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

ఆలేరు నియోజకవర్గంలో రోడ్లు, భవనాలు, సాగునీరు, తాగునీరు, గృహ నిర్మాణం, రెవెన్యూ తదితర ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలను సమావేశంలో వివరించిన బీర్ల అయిలయ్య.. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రులను కోరారు. ప్రజా సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సూచించారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీదుర్గామాత ఆలయంలో చండీ హోమం

- వేద మంత్రోచ్చారణల నడుమ వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్
- కుత్బుల్లాపూర్, ఆగస్టు 29, తరంగాలు :



వేద మంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాల నడుమ.. భక్తుల భక్తిశ్రద్ధలతో కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. వినాయక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీదుర్గామాత ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో భాగంగా శనివారం చండీ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన చండీ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. హోమకుండం నుంచి వెలువడిన పవిత్ర జ్వాలలు, మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చండీ హోమంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీదుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.



# స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 29,తరంగాలు:** బాలసముద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, క్రీడా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. యువతలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు మౌలిక వసతుల అభివృద్ధి ఎంతో అవసరమని తెలిపారు. స్విమ్మింగ్ వంటి క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని ఎంపీ తెలిపారు. ఈ స్విమ్మింగ్ పూల్‌ను క్రీడాకారులు, యువత సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



# ఇంట్లో చీమలు ఎక్కువగా ఉంటే. ఈ సహజసిద్ధమైన చిట్కాలు అద్భుతంగా పనిచేస్తాయి

ఇంట్లోకి చీమలు రావడం చాలామందికి ఎదురయ్యే సాధారణ సమస్య. ముఖ్యంగా వంటగదిలో ఆహారం, తీపి పదార్థాలు, కిందపడిన ఆహార పదార్థాల వాసనకు చీమలు త్వరగా ఆకర్షితమవుతాయి. అయితే ఆహారం మాత్రమే కాదు.. తేమ కూడా చీమలను ఇంట్లోకి రప్పిస్తుంది. అందుకే వంటగది సింక్‌లు, బాత్‌రూమ్‌లు, అల్మారాలు, వార్డ్‌రోబ్‌లలోని దుస్తుల దగ్గర కూడా చీమలు కనిపిస్తుంటాయి. కొన్నిసార్లు చీమలను కదిలించినప్పుడు అవి కుట్టే అవకాశం కూడా ఉంటుంది. చీమలు విడుదల చేసే ఫార్మిక్ యాసిడ్ కారణంగా చర్మంపై స్వల్ప మంట, చికాకు, ఎర్రటి మచ్చలు కనిపిస్తాయి. ఇంట్లో ఒక్కసారిగా చీమలు ఎక్కువగా కనిపిస్తే, వాటిని దూరంగా ఉంచేందుకు వంటగదిలో సాధారణంగా లభించే కొన్ని పదార్థాలను ఉపయోగించవచ్చు.

### తడి నేల ఉంటే..

చీమలు ఇంట్లోకి రావడానికి ప్రధాన కారణాల్లో పరిశుభ్రత లేకపోవడం ఒకటి. నేలపై పడిన ఆహారపు ముక్కలు, చిందిన పదార్థాలు, ఇతర ఆహార అవశేషాలను సరిగా శుభ్రం చేయకపోతే చీమలు వాటికి ఆకర్షితమవుతాయి. ముఖ్యంగా వంటగదిలో ఆహారాన్ని మూత లేకుండా ఉంచడం, తీపి పదార్థాలను బయట ఉంచడం వల్ల చీమలు సులభంగా అక్కడికి చేరుతాయి. నీటి కోసం కూడా చీమలు ఇంట్లోకి వస్తుంటాయి. తడిగా ఉండే ప్రదేశాలు, వంటగది సింక్‌లు, బాత్‌రూమ్‌లు, లీక్ అవుతున్న నల్లాల దగ్గర ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. అలాగే తీవ్రమైన ఎండ, భారీ వర్షాలు లేదా చలి సమయంలో బయట వాతావరణం నుంచి రక్షణ కోసం చీమలు ఇంట్లోకి చేరి గూడు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది.

### వెనిగర్ మిశ్రమం..

చీమలు ఆహారం లేదా నీటి మార్గాన్ని గుర్తించేందుకు ఫెరోమోన్ అనే రసాయన సంకేతాల ఆధారంగా ఏర్పడే వాసన మార్గాలను ఉపయోగిస్తాయి. ఘాటైన వాసన కలిగిన కొన్ని పదార్థాలు ఈ మార్గాలను అంతరాయం కలిగిస్తాయి. దీంతో చీమలకు ఆహారం లేదా నీటి దారి గుర్తించడం కష్టమవుతుంది. ఇంట్లో చీమలు కనిపించే ప్రదేశాల్లో వెనిగర్‌ను ఉపయోగించవచ్చు. సమాన పరిమాణంలో వైట్ వెనిగర్, నీటిని కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వంటగది కౌంటర్‌లు, కిటికీలు, తలుపుల ఫ్రేమ్‌లు, చీమలు లోపలికి వచ్చే మార్గాల్లో స్ప్రే చేయవచ్చు. నేలను తుడిచే నీటిలో కొద్దిగా వెనిగర్ కలపడం వల్ల కూడా చీమలను దూరంగా ఉంచవచ్చు. బిర్యానీ ఆకులు లేదా బే లీవ్స్‌ను కూడా చీమలను దూరంగా ఉంచేందుకు ఉపయోగించవచ్చు. వీటి ఘాటైన వాసన చీమలకు నచ్చదు. కొన్ని బే లీవ్స్‌ను స్వల్పంగా నలిపి చీమలు కనిపించే ప్రాంతాల్లో, తలుపులు లేదా కిటికీల దగ్గర అలాగే చక్కెర డబ్బాలు, తీపి పదార్థాలు ఉంచే ప్రదేశాల దగ్గర పెట్టాలి. ఇలా చేయడం వల్ల చీమలు ఆహార పదార్థాలకు దూరంగా ఉంటాయి.

### పసుపు..

పసుపు కూడా ఇంట్లో చీమలను నివారించేందుకు ఉపయోగించే మరో సాధారణ వంటింటి పదార్థం. పసుపు వాసన చీమలను నిరుత్సాహపరుస్తుంది. చీమలు ఇంట్లోకి ప్రవేశించే తలుపులు, కిటికీలు లేదా ఇతర ప్రదేశాల దగ్గర పసుపు పొడితో పలుచని గీతలా చల్లాలి. ఎర్ర మిరపకాయ, ఉప్పుతో తయారు చేసిన స్ప్రేను కూడా మనం ఉపయోగించవచ్చు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో 2కే రన్

**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 29:** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెంలో 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన, క్రీడల కార్యాలయ అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి యు.పరంధామ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఒక గంట క్రీడల కోసం, వ్యక్తిగత మానసిక ఉల్లాసం కోసం సమయం కేటాయించాలని సూచించారు. భారతదేశానికి గర్వకారణమైన క్రీడాకారుడు, భారత క్రీడా రంగానికి చిరస్మరణీయమైన సేవలందించిన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.కొత్తగూడెంలోని బస్టాండ్ ప్రాంతంలో సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో అన్ని క్రీడా సదుపాయాలు నిర్మించే విధంగా భూమిని గుర్తించి, సమగ్ర క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతికి పంపుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారులు, సిబ్బంది, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో సూపర్‌వైజర్ల పాత్ర కీలకం





డీఎంహెచ్ఓ డా.బి.రాజా రెడ్డి

**వరంగల్ ప్రతినిధి,, ఆగస్టు 29,తరంగాలు** : జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని డీఎంహెచ్ఓ డా.బి.రాజా రెడ్డి అన్నారు.

వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , యూఎఫ్‌డబ్ల్యూసీలలో పనిచేస్తున్న పర్యవేక్షకులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయి పనితీరు, లక్ష్యాల సాధనపై సంబంధిత ప్రోగ్రాం అధికారులు సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా చూడడంలో సూపర్‌వైజర్లు కీలక పాత్ర పోషించాలి అని అన్నారు. సూపర్‌వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయి సందర్శనలు నిర్వహిస్తూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తమ విధులను సకాలంలో, సమర్థవంతంగా నిర్వహించేలా ప్రోత్సహించాలని, అవసరమైన చోట సపోర్టివ్ సూపర్‌విజన్ అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అందించిన ఆరోగ్య సేవలకు సంబంధించిన డేటాను సంబంధిత సిబ్బంది అదే రోజున సంబంధిత వెబ్‌సైట్లలో నమోదు చేసేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

### సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి

సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ సూచించారు. ప్రతి వారం డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, ఆశా కార్యకర్తల ద్వారా జ్వర సర్వే నిర్వహించడం, జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన పరీక్షలు, చికిత్స అందించేలా చూడాలని ఆదేశించారు.

### ఎంసీహెచ్ సేవలు, డేటా నమోదు

ఎంసీహెచ్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ డేటాను రెండు రోజుల్లోగా పూర్తిగా అప్‌డేట్ చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. గర్భిణీలు, ప్రసవాలు, తల్లులు మరియు శిశువులకు సంబంధించిన సేవల డేటా సకాలంలో నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు.

### క్షయ వ్యాధి నిర్మూలనకు చర్యలు వేగవంతం చేయాలి

క్షయ వ్యాధి నియంత్రణ కార్యక్రమంపై ప్రత్యేకంగా సమీక్షిస్తూ, క్షయ వ్యాధి అనుమానితులను ఎక్కువ సంఖ్యలో గుర్తించి స్పుటం పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన ప్రతి వ్యక్తికి సకాలంలో చికిత్స ప్రారంభించి, మందులు క్రమం తప్పకుండా అందేలా పర్యవేక్షించాలని సూచించారు. అలాగే క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు, నిర్ధారణ, చికిత్స ప్రారంభం మరియు ఫాలోఅప్ వివరాలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్య సాధన కోసం క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డా. సాజిదా, డా. ఇక్తిదార్ అహ్మద్, డీఎన్ఎంఓ డా. మానస శ్యామల, డీపీఓ అర్చన, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, ఎస్ఓ ప్రసన్న కుమార్, డీపీహెచ్ఎన్ఓ మనోజతో పాటు వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల జిల్లా సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**పర్వతగిరి, ఆగస్టు 29,తరంగాలు** : పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మృతుల కుటుంబాలను పరామర్శించారు.గ్రామంలోని మసాని మరియా,ధమిషెట్టి రాజు,రౌతు వీరస్వామిలు ఇటీవల మరణించగా వారి నివాసాలకు వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు,అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.మృతుల కుటుంబాలను ఎల్లవేళల అండగా ఉంటామన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సావిత్రి, గ్రామ సర్పంచ్ తౌర్రి పద్మ యాదవ్,గ్రామశాఖ అధ్యక్షులు ఎర్రబెల్లి మధుకర్ రావు,ఉపాధ్యక్షులు శివరాత్రి సారంగపాణి,జిల్లా మాజీ ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు,వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు,గ్రామశాఖ అధ్యక్షులు,వార్డు మెంబర్లు,మండల ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# పుష్కర పనులకు పరుగులు

- **భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు** 29:
2027 జూన్--జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో జిల్లాలోని పుష్కర ఘాట్ల వద్ద సౌకర్యాల కల్పన పనులను వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. భద్రాచలం పుష్కర క్షేత్రంతో పాటు పర్ణశాల, మోతేపట్టినగర్ ప్రాంతాల్లో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఘాట్ల మరమ్మతులు, అప్రోచ్ రోడ్లు, పార్కింగ్, అత్యవసర ఎగ్జిట్ తదితర సౌకర్యాలను ప్రాధాన్యతతో చేపడతామని పేర్కొన్నారు. వారానికోసారి పనుల పురోగతిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.



## శాకాహారులకు ప్రోటీన్లను అందించే అత్యుత్తమ ఆహారం ఇది.. రోజూ తీసుకుంటే ఎంతో మేలు

శాకాహారులు, వీగన్లు రోజువారీ ఆహారంలో తగినంత ప్రోటీన్ పొందేందుకు ఎన్నో



మొక్కల ఆధారిత ఆహారాలను ఎంచుకుంటారు. అయితే ప్రోటీన్‌తోపాటు ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు వంటి పలు పోషకాలను ఒకేసారి అందించే చిన్న విత్తనం ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టిని ఆకర్షిస్తోంది. అదే హెంప్ హార్ట్స్. పొట్టు తొలగించిన హెంప్ విత్తనాలు తినడానికి సులభంగా ఉండటంతోపాటు, తక్కువ పరిమాణంలోనే పలు ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. హెంప్ హార్ట్స్‌లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. సుమారు రెండు టేబుల్ స్పూన్ల హెంప్ హార్ట్స్‌లో 8.4 గ్రాముల వరకు మొక్కల ఆధారిత ప్రోటీన్ లభిస్తుంది. అలాగే శరీరానికి అవసరమైన మొత్తం తొమ్మిది ఎసెన్షియల్ అమైనో యాసిడ్లు ఇందులో ఉంటాయి. అందువల్ల వీటిని కంప్లీట్ ప్రోటీన్ అందించే ఆహార వనరుగా తీసుకోవచ్చు. ముఖ్యంగా శాకాహారులు, వీగన్లకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది.

### అమైనో యాసిడ్లు అధికం..

హెంప్ హార్ట్స్‌లో అర్జినైన్ అనే అమైనో యాసిడ్ కూడా సహజంగా సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తికి సహాయపడుతుంది. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలు సడలించడంలో, రక్తప్రసరణ సక్రమంగా ఉండటంలో, సాధారణ రక్తపోటు నియంత్రణకు తోడ్పడటంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. వీటిలో ప్రోటీన్ మాత్రమే కాకుండా మెగ్నీషియం, ఒమెగా-3 వంటి పోషకాలు కూడా లభిస్తాయి. సుమారు 25 గ్రాములు లేదా రెండు టేబుల్ స్పూన్ల హెంప్ హార్ట్స్‌లో దాదాపు 175 మిల్లీగ్రాముల మెగ్నీషియం, 2.5 గ్రాముల ఏఎల్ఏ ఒమెగా-3 లభిస్తుంది. ఇందులో ఏఎల్ఏ, ఎల్ఏ, జీఎల్ఏ వంటి కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. హెంప్ హార్ట్స్‌లో ఒమెగా-6 నుంచి ఒమెగా-3 నిష్పత్తి సుమారు 2.5:1 నుంచి 3:1 వరకు ఉంటాయి. హెంప్ హార్ట్స్‌లోని పోషకాల కలయిక వాటిని చిన్న పరిమాణంలోనే ఎక్కువ పోషకాలను అందించే ఆహారంగా మారుస్తుంది. ప్రోటీన్, మెగ్నీషియం, ఏఎల్ఏ, జీఎల్ఏ, అర్జినైన్ వంటి పోషకాలు ఇందులో ఉండటం వల్ల రోజువారీ ఆహారంలో వీటిని చేర్చుకోవచ్చు.

### శరీరంలోని వాపులు తగ్గేందుకు..

హెంప్ హార్ట్స్‌లోని కొవ్వు ఆమ్లాలు శరీరంలోని వాపు సంబంధిత ప్రక్రియలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా జీఎల్ఏ వాపును నియంత్రించే మార్గాల్లో భాగస్వామ్యం అవుతుందని, వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మం, గుండె ఆరోగ్యానికి కూడా తోడ్పడతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. హెంప్ విత్తనాలకు భారతీయ సంస్కృతి, పురాణాలతో కూడా ఒక ఆసక్తికరమైన సంబంధం ఉంది. సముద్ర మథనం సమయంలో ఉద్భవించిన హాలాహల విషాన్ని లోకరక్షణ కోసం పరమశివుడు స్వీకరించి తన కంఠంలో నిలుపుకున్న కథ తెలిసిందే. ఈ కారణంగానే శివుడిని నీలకంఠుడిగా పిలుస్తారు. హెంప్ మొక్కకు సంబంధించిన విత్తనాలపై కూడా ఈ పురాణగాథతో ముడిపడిన సాంస్కృతిక ప్రస్తావనలు ఉన్నాయి.

### పెద్ద మొత్తంలో అవసరం లేదు..

రోజువారీ ఆహారంలో హెంప్ హార్ట్స్‌ను పెద్ద మొత్తంలో తీసుకోవాల్సిన అవసరం లేదు. మొదట ఒక టేబుల్ స్పూన్ అంటే సుమారు 12 నుంచి 13 గ్రాములతో ప్రారంభించాలి. వీటిని పెరుగు, ఓట్స్, స్మూతీలు, సలాడ్లు వంటి ఆహారాల్లో కలుపుకోవచ్చు. అలాగే పప్పు, చిల్లా పిండిలో లేదా గోధుమ పిండిలో కూడా హెంప్ హార్ట్స్‌ను కలిపి తీసుకోవచ్చు. ఇలా సాధారణంగా తీసుకునే ఆహారాల్లోనే వీటిని చేర్చుకోవడం ద్వారా అదనంగా మొక్కల ఆధారిత ప్రోటీన్‌తో పాటు మెగ్నీషియం, ఒమెగా-3 తదితర పోషకాలను ఆహారంలో చేర్చుకోవచ్చు.

THARANGALU DAILY NEWS
ఆదివారం, 30 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# జర్మనీని చిత్తు చేసిన టీమిండియా



బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2026 ఎఫ్ఐహెచ్ మహిళల హాకీ వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత మహిళల హాకీ జట్టుకు హాకీ ఇండియా 50 లక్షల రూపాయల భారీ నగదు పురస్కారాన్ని అనౌన్స్ చేసింది. ఆమ్‌స్టెల్‌వీన్ వేదికగా జరిగిన 5/6 క్లాసిఫికేషన్ మ్యాచ్‌లో ప్రపంచ నంబర్ 5 జట్టు జర్మనీని 3-1 తేడాతో ఓడించి భారత జట్టు ఐదో స్థానంలో నిలిచింది. 1974 లో జరిగిన ప్రారంభ ఎడిషన్‌లో నాల్గో స్థానం సాధించిన తర్వాత, గత 52 ఏళ్ల వరల్డ్ కప్ చరిత్రలో భారత మహిళల జట్టు నమోదు చేసిన అత్యుత్తమ ఫలితం ఇదే. టోర్నీ ఆద్యంతం కేవలం నెదర్లాండ్స్ చేతిలో మాత్రమే ఓడిన భారత్, బలమైన చైనా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా జట్లను డ్రాలతో నిలువరించి, సౌతాఫ్రికాను 6-1 తో చిత్తు చేసింది. ఈ ఘనతపై హాకీ ఇండియా ప్రెసిడెంట్ పద్మశ్రీ దిలీప్ టిర్కీ స్పందిస్తూ జట్టును కొనియాడాడు. “భారత మహిళల హాకీ చరిత్రలో ఇది నిజంగా ఒక అద్భుతమైన ఫలితం. 52 ఏళ్ల తర్వాత ప్రపంచకప్‌లో ఐదో స్థానాన్ని దక్కించుకోవడం జట్టు కఠిన శ్రమ, పోరాట పటిమకు నిదర్శనం. మా ప్రశంసలకు గుర్తుగా జట్టుకు 50 లక్షల రూపాయల నగదు బహుమతిని ప్రకటిస్తున్నాను. ఇది రాబోయే టోర్నీల్లో మరింత ఉన్నత స్థాయికి చేరేందుకు ప్లేయర్లకు స్ఫూర్తినిస్తుందని ఆశిస్తున్నాను” అని తెలిపాడు. హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ భోలా నాథ్ సింగ్ కూడా మాట్లాడుతూ కెప్టెన్ సలీమా టెటే బృందం దేశం గర్వించేలా చేసిందని, ఆసియన్ గేమ్స్ కు ముందు ఇది గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని పేర్కొన్నాడు. తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనగా గోల్స్ నమోదు కాకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. భారత గోల్ కీపర్ బిచ్చు దేవి, డిఫెన్స్ విభాగం జర్మనీ పెనాల్టీ కార్నర్లను సమర్థవంతంగా అడ్డుకున్నాయి. అయితే హాఫ్ టైమ్ తర్వాత భారత జట్టు దూకుడు పెంచి, ఫలితాన్ని సాధించింది. 43వ నిమిషంలో ఇషికా చౌదరి రివర్స్ లిఫ్ట్ షాట్‌తో తొలి గోల్ సాధించి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించింది. ఆ తర్వాత నిమిషంలోనే దక్కిన పెనాల్టీ కార్నర్‌ను నవ్‌నీత్ కౌర్ గోల్‌గా మార్చడంతో స్కోరు 2-0 తో డబులైంది. 47వ నిమిషంలో నవ్‌నీత్ కౌర్ మరోసారి అద్భుత ఫీల్డ్ గోల్ చేసి ఆధిక్యాన్ని 3-0 కి పెంచింది. 59వ నిమిషంలో జర్మనీ తరపున లిన్ క్రింగ్స్ ఒక గోల్ సాధించి లోటును తగ్గించినప్పటికీ, భారత జట్టు పట్టు సడలించలేదు. వెటరన్ గోల్ కీపర్ సవితా పూనియా ఆఖరి క్వార్టర్‌లో కీలకమైన పెనాల్టీ కార్నర్‌ను నిలువరించి భారత్ విజయాన్ని ఖాయం చేసింది. చీఫ్ కోచ్ జోర్డ్ మారిజ్నే మార్గదర్శకత్వంలో భారత్ 3-1 తో మ్యాచ్‌ను ముగించి ప్రపంచ వేదికపై సరికొత్త చరిత్ర సృష్టించింది.

# ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల




నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఇరుముడి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్‌కు రెడీ




మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' . ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక్' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్టాం÷-రగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. ÷ూజా సమాచారం ప్రకారం, ప్రముఖ దిగ్గజ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ 'నెట్‌ఫ్లిక్స్' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.

# నాగార్జున వందో సినిమా.. కింగ్ 100 గ్లింప్స్ విడుదల




అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.

# ధోనీకి చెన్నై సూపర్ కింగ్స్ బంపరాఫర్!




వాటాల విషయంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మహేంద్ర సింగ్ ధోనీ విభేదాలు తలెత్తాయని ప్రచారం జరిగింది. సీఎస్‌కేలోని 25 శాతం షేర్లను తనకు అమ్మాలని ధోనీ కోరగా.. ఆ టీమ్ యజమాన్యం నిరాకరించిందని వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకు ఈ వార్తలపై ధోనీ గానీ, సీఎస్‌కే మేనేజ్‌మెంట్ కానీ స్పందించలేదు. దాంతో సీఎస్‌కేకు ధోనీ దూరంగా ఉంటాడనే అభిప్రాయం వ్యక్తమైంది. కానీ ధోనీకి చెన్నై సూపర్ కింగ్స్ బంపరాఫర్ ఇచ్చినట్లు తాజాగా ఓ నివేదిక బయటకు వచ్చింది. సీఎస్‌కే హెడ్ కోచ్‌గా లేదా కన్సల్టెంట్‌గా బాధ్యతలు చేపట్టాలని ధోనీకి ఆఫర్ ఇచ్చినట్లు సదరు రిపోర్ట్ పేర్కొంది. అయితే ఆఫర్‌పై ధోనీ ఇంకా నిర్ణయం తీసుకోలేదని, దాంతో సీఎస్‌కే మేనేజ్‌మెంట్ వేచి చూస్తుందని తెలుస్తోంది. ధోనీ నుంచి నిర్ణయం వెలువడిన తర్వాత వచ్చే సీజన్‌కు సంబంధించిన ప్రణాళికలను, వేలంలో అనుసరించాల్సిన వ్యూహాలను సిద్ధం చేయాలని సీఎస్‌కే నిర్ణయించినట్లు సమాచారం. ఐపీఎల్ 2026 సీజన్‌లోచెన్నై సూపర్ కింగ్స్ తీవ్రంగా నిరాశపర్చింది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో 14 మ్యాచ్‌ల్లో 6 విజయాలు మాత్రమే సాధించి పాయింట్స్ టేబుల్‌లో 8వ స్థానంలో నిలిచింది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఐపీఎల్ చరిత్రలోనే ధోనీ ఒక సీజన్ మొత్తం ఆడకపోవడం ఇదే తొలిసారి. అంతేకాకుండా హెడ్ కోచ్‌గా 19 ఏళ్లు సేవలందించిన స్టీఫెన్ ఫ్లేమింగ్ కూడా జట్టును వీడాడు. 2008లో ఆటగాడిగా జట్టులోకి వచ్చిన ఫ్లెమింగ్.. 2009లో హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతని పర్యవేక్షణలో సీఎస్‌కే ఐదు టైటిళ్లు గెలిచింది. అతను తప్పుకోవడంతో సీఎస్‌కే కొత్త కోచ్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీఎస్‌కే ఆఫర్‌పై ధోనీ తేల్చిన తర్వాతే కొత్త కోచ్ ఎంపిక ప్రక్రియను మొదలు పెట్టాలనుకుంటుంది. ధోనీ ఏ విషయం చెప్పకపోవడం వల్ల సీఎస్‌కే కార్యకలాపాలన్నీ ఆగిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఐపీఎల్ 2027 సీజన్‌లో ధోనీ ఆటగాడిగా కొనసాగడనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది.

# బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్



ప్రస్తుతం సమంత తల్లికాబోతున్న ఆనందం లో ఉన్నారు. ఒకవైపు బేబీమూన్ ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోన్న సామ్.. మరోవైపు వ్యాయామం చేస్తూ అభిమానులతో ఫొటోలు పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టా వేదికగా ఫ్యాన్స్‌తో ముచ్చటించారు. కొందరు తల్లులు ఆమెకు సలహాలు ఇవ్వగా.. మరికొందరు ఆమెతో వారి అనుభవాలు పంచుకున్నారు. బేబీ కోసం కావాల్సిన వస్తువులన్నీ కొన్నాను. వాటిని చూస్తుంటే కాస్త కంగారుగా ఉంది. అందుకే ప్రస్తుతానికి వాటిని ప్యాక్ చేసి ఆ బ్యాగ్‌ను ఒక లాప్‌టాప్ స్టాండ్‌గా వాడుతున్నానన్నారు. ప్రెగ్నెన్సీతో ఉన్నప్పటి నుంచి నాకు కలలు వస్తున్నాయి. మీకు కూడా వస్తున్నాయా అంటూ ప్రశ్నలు వేస్తున్నారు. నిజంగానే.. ఈ విచిత్రమైన కలల గోల ఏంటో అర్థం కావట్లేదు. మరోవైపు11 కేజీలు పెరిగానన్నారు. కొత్తగా తల్లి అయిన తర్వాత చాలా మార్పులు వస్తాయట.నేను ఆ క్షణాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. పుట్టినవారికి పాలు పట్టడం, జోలపాడి నిద్రపోయేలా చేయడం.. ఈ పనులు ఫుల్ టైమ్ జాబ్‌లా మారిపోతాయి. అది చాలా అందమైన, గొప్ప అనుభూతి. జీవితాన్ని మార్చే అనుభవం. మాతృత్వం ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది.



ఎవరు..?
EVARU..?
ప్రశ్న ప్రజలది.. సమాధానం మా అన్వేషణ
వార్తలు | విశ్లేషణ | గ్రౌండ్ రిపోర్ట్ | ప్రజల గొంతుక | ప్రత్యేక కథనాలు | ఫ్యాక్ట్ చెక్
ఎవరు..?
@evaruofficial
ప్రశ్న ప్రజలది.. సమాధానం మా అన్వేషణ
SUBSCRIBE
చానల్ ఇంట్రో (Intro)
ఎవరు..?
ఎవరు..? ఏం జరిగింది..? ఎందుకు జరిగింది..?
అసలు నిజం ఏమిటి..?
ప్రజల ప్రశ్నలకు సమాధానం వెతుకుతూ..
వార్త వెనుక ఉన్న వాస్తవాన్ని
మీ ముందుకు తీసుకొచ్చే వేదిక..
ఎవరు..?
ప్రశ్న ప్రజలది.. సమాధానం మా అన్వేషణ.
నిజం
మా కంటెంట్ సెగ్మెంట్లు
01 ఎవరు..? స్పెషల్
ప్రముఖులు, ప్రభావశీల వ్యక్తుల పూర్తి పరిచయం
02 ఎవరు..? ఎందుకు..?
ఒక సంఘటన వెనుక కారణాలు
03 ఎవరు..? గ్రౌండ్ రిపోర్ట్
క్షేత్ర స్థాయి నుండి నేరుగా కథనాలు
04 ఎవరు..? ప్రజల ప్రశ్న
ప్రజలు అడిగే ప్రశ్నలు – మా వేదికపై
05 ఎవరు..? ఫ్యాక్ట్ చెక్
వైరల్ వార్తల్లో నిజమెంత?
06 ఎవరు..? 60 సెకండ్స్
తాజా వార్తలు – 60 సెకండ్లలో
07 ఎవరు..? ప్రత్యేక కథనం
లోతైన విశ్లేషణతో ప్రత్యేక కథనాలు
ఎందుకు ఎవరు..? సబ్‌స్క్రైబ్ చేయాలి?
నిజాన్ని తెలుసుకోవడానికి
ప్రజల సమస్యలను మీ ముందుకు తీసుకురావడానికి
వాస్తవాల ఆధారంగా నమ్మకమైన సమాచారానికి
నిర్భయంగా.. నిజాయితీగా..
మీ మద్దతే మా బలము
ప్రశ్నిద్దాం..
తెలుసుకుందాం..
మార్పు తీసుకురాందాం..!
Who...?...?
NEWS
ఎవరు?
YouTube CHANNEL
TV
ప్రశ్న ప్రజలది... సమాధానం మా అన్వేషణ